క్లుప్తంగా

రైతులకు అందుబాటులో ఉండాలి



జొన్న పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య

నార్నూర్: రైతులకు అందుబాటులో ఉండి పంటల సాగులో సూచనలు, సలహాలు అందించాలని జిల్లా వ్యవసాయాధికారి అధికారి పుల్లయ్య అన్నారు. గాదిగూడ మండలంలోని మారెగాం, రుప్పాపూర్, ఖాండోవ్ గ్రామాల శివారులో రైతులు పండిస్తున్న జొన్న పంటలను శుక్రవారం పరిశీలించారు. అనంతరం గాదిగూడ మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. రైతుల వివరాలు, రబీసాగు గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రతిఒక్క రైతుకి రైతుబంధు, రైతు బీమా కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏడీ రాథోడ్ గణేశ్, ఏవో జాడీ దివ్య, ఏఈవో నాగోరావు, కొండిబారావు పాల్గొన్నారు.

ఆర్మీ ఫలితాల్లో ప్రతిభ

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్, కామర్స్ డిగ్రీ కళాశాల విద్యార్థి ఆర్మీ ఉద్యోగ నియామకంలో ప్రతిభ కనబరిచాడు. కళాశాలలో బీ.ఏ తృతీయ సంవత్సరం చదువుతున్న తేజస్ ఇటీవల జరిగిన అగ్నివీర్ ఫలితాల్లో ఉద్యోగం సాధించాడు. దీంతో శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ అనిత, సిబ్బంది అభినందించారు.

శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు

ఉట్నూర్: గిరిజన ప్రాంతాల్లో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని డీఎస్పీ నాగేందర్ అన్నారు. శుక్రవారం ఉట్నూర్ డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రజలకు సేవలు అందించడం ఆనందంగా ఉందన్నారు. గ్రామాల్లో అనుమానితులు కలిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

ముఖరా(కె)ను ఆదర్శంగా తీసుకోవాలి



ఇంకుండు గుంతను పరిశీలిస్తున్న కిషన్

ఇచ్చోడ: అభివృద్ధిలో ముఖరా(కె)ను ఆదర్శంగా తీసుకోవాలని ఎస్‌బీఎం కోఆర్డినేటర్ కిషన్ అన్నారు. శుక్రవారం ఆయన ముఖరా (కె) గ్రామాన్ని సందర్శించి పల్లెప్రగతి పనులు పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంకుడు గుంతలు, తడి, పొడిచెత్త ద్వారా వర్మీకంపోస్టు తయారు కేంద్రాలను పరిశీలించారు. వంద శాతం ప్రభుత్వ పథకాలను అమలు చేయడంలో ముఖరా(కె) రాష్ట్రంలోనే ముందుందన్నారు. ఆయన వెంట ఎస్‌బీఎం కోఆర్డినేటర్లు రమేశ్, వేణు, రాఘవు, సర్పంచ్ గాడ్గే మీనాక్షి, ఎంపీటీసీ గాడ్గే సుభాష్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



పూజలు చేస్తున్న రావుత్ మనోహర్

బేల: వడ్రంగి కులస్తుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రావుత్ మనోహర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో వడ్రంగి కులస్తుల ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి వేడుకలు నిర్వహించారు. విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఠాక్రే గంభీర్, జక్కుల మధుకర్, సతీష్‌పవార్, ఇంద్రశేఖర్, తన్వీర్‌ఖాన్, గోడం సునీల్, రాంకిషన్, మానుస్మారే అభయ్, వెంకన్న, విష్ణుదాస్, గజానన్, అనిల్ పాల్గొన్నారు.

ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

నేరడిగొండ: విశ్వబ్రాహ్మణులకు విశ్వకర్మ యోజన నిధిని ఏర్పాటు చేస్తామని ప్రధాన మంత్రి మోదీ పార్లమెంటులో చెప్పడం హర్షణీయమని విశ్వబ్రాహ్మణుల సంఘం మండల అధ్యక్షుడు మండాజి శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలో నరేంద్ర మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. తెలంగాణ రాష్ట్ర లెక్చరర్ల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ మాట్లాడుతూ.. మోదీ ప్రకటన చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం ప్రధాన కార్యదర్శి వెంకటరమణ, కోశాధికారి సుభాష్, చొక్కపెల్లి రాములు, నారాయణ, సురేశ్, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

నత్తనడకన రోడ్డు పనులు

- గడువు ముగిసినా.. పూర్తికాని వైనం
- ప్రమాదాల బారిన ప్రజలు
- త్వరితగతిన పూర్తి చేయాలని మర్లపెల్లి గ్రామస్తుల ధర్నా



ధర్నా చేస్తున్న మర్లపెల్లి గ్రామస్తులు

బోథ్: మండల కేంద్రం నుంచి నిగిని గ్రామానికి వెళ్లే రోడ్డు పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో ప్రజలు తరచూగా ప్రమాదాలకు గురవుతున్నారు. దాదాపు 15 గ్రామాల ప్రజలు కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేస్తున్నారు. మర్లపెల్లి గ్రామస్తులు శుక్రవారం ఉదయం ధర్నా నిర్వహించారు. దాదాపు గంట సేపు వాహనాలు నిలిచిపోయాయి. రోడ్డు నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

పూర్తికాని పనులు..

బోథ్ మండల కేంద్రం నుంచి నిగిని వరకు 16 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం కోసం ప్రభుత్వం 2018లో రూ.19 కోట్లు కేటాయించింది. టెండరు ద్వారా పనులు దక్కించుకున్న ఓ సంస్థ రెండేళ్ల క్రితం పనులు ప్రారంభించింది. అప్పటి నుంచి రోడ్డు నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. నిగిని నుంచి మర్లపెల్లి వరకు డబుల్ రోడ్డు పూర్తిచేశారు. మర్లపెల్లి గ్రామం నుంచి బోథ్ వరకు పనులు ఇంకా పూర్తి కాలేదు. గత ఏడాది 2022 మార్చిలో పనులు పూర్తికావాల్సి ఉంది. కానీ ఇంత వరకు పూర్తికాలేదు. తవ్విన గుంతలు, కంకర ఉండడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.

కలెక్టర్‌కు విన్నవించినా ఫలితం శూన్యం..

రోడ్డు నిర్మాణ పనుల ఆలస్యం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని మర్లపెల్లి గ్రామానికి చెందిన వెంకటేష్ అనే యువకుడు ఇటీవల జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. అయినా రోడ్డు పనులు నత్తనడకనే సాగుతున్నాయి. ప్రస్తుతం పనులు కూడా సాగడం లేదు. అధికారులు కూడా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కంకర తేలిన రోడ్డు

పట్టించుకోవడం లేదు



రోడ్డు పనులు త్వరగా చేపట్టాలని ఇటీవల జిల్లా కలెక్టర్‌కు విన్నవించాను. అయినా ఎటువంటి స్పందన లేదు. ప్రయాణం నరకంగా మారింది. రెండేళ్లుగా పనులు చేపడుతూనే ఉన్నాం. చాలా మంది ప్రమాదాలకు గురయ్యారు. అధికారులు స్పందించి రోడ్డు పనులు పూర్తిచేయించాలి.

– వెంకటేష్, మర్లపెల్లి

ప్రమాదాలకు గురవుతున్నాం



రోడ్డు పనులు పూర్తి కాకపోవడంతో ప్రమాదాలకు గురవుతున్నాం. రోడ్డు పనులు నత్తనడకన సాగుతున్నాయి. పాత రోడ్డును తీసివేశారు. కొత్త రోడ్డు నిర్మాణం పనుల్లో భాగంగా వేసిన కంకర, మొరం వల్ల ప్రయాణం చేయలేకపోతున్నాం. బోథ్‌కు వెళ్లాలంటే ప్రా ణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

– తూము సంతోష్, మర్లపెల్లి

చర్యలు తీసుకుంటాం

బోథ్– నిగిని రోడ్డు పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం. గత ఏడాది 2022, మార్చిలో పనులు పూర్తి చేయాల్సి ఉంది. గుత్తేదారుతో మాట్లాడుతున్నాం. పనులు త్వరగా చేపట్టాలని సంస్థ ప్రతినిధులకు తెలియజేస్తాం.

– సునీల్, ఆర్అండ్‌బీ, డీఈ

మూణ్నాళ్ల ముచ్చటే..



గ్రామీణ ప్రాంతాల్లో బీటీరోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తుంది. అయితే అధికారుల పర్యవేక్షణ లోపం, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో పనుల్లో నాణ్యత పాటించడం లేదు. దీంతో రోడ్లు మూణ్నాళ్ల ముచ్చటగానే మారుతోంది. జైనథ్ మండలం సాంగ్వీ గ్రామం వద్ద ఇటీవల నిర్మించిన తారు రోడ్డు పగుళ్లు తేలింది.

– సాక్షి, ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



సీమంతం చేస్తున్న సర్పంచ్, అంగన్‌వాడీలు

నేరడిగొండ: పౌష్టికాహారంతోనే గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారని రాజురా సర్పంచ్ అనూష అన్నారు. శుక్రవారం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతం నిర్వహించారు. గాజులు, పండ్లు, పసుపు, కుంకుమ అందించారు. పౌష్టికాహారంతో పాటు పండ్లు, ఐరన్ మాత్రలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త ప్రేమ, సూపర్‌వైజర్ మంజుల, పాఠశాల టీచర్ మల్లేశ్వరి, ఆశ కార్యకర్త, బాలింతలు, కిషోర బాలికలు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటించాలి

నేరడిగొండ: ప్రతిఒక్కరూ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలని హైదరాబాద్‌కు చెందిన సెయింట్ ఆన్స్ మహిళా డిగ్రీ కళాశాల హిస్టరీ ప్రొఫెసర్ మితాజోషి అన్నారు. శుక్రవారం మండలంలోని లఖంపూర్ పరిధిలోని చించోలిలో పర్యటించి వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకున్నప్పుడే ఆరోగ్యవంతంగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో భాస్కర్, లక్ష్మినారాయణ, లఖంపూర్ సర్పంచ్ జంగు, ప్రధానోపాధ్యాయుడు ఎం.అశోక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతి విజయవంతం చేయండి



కరపత్రాలు అందజేస్తున్న నాయకులు

నేరడిగొండ: శ్రీసంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలను విజయవంతం చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ కోరారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ.. ఈనెల 12న హైదరాబాద్‌లోని బంజారా భవన్ నిర్వహించే కార్యక్రమానికి అధిక సంఖ్యలో హాజరు కావాలన్నారు. అనంతరం మండల కేంద్రంలో పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో లంబాడాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌కుమార్ జాదవ్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రేఖానాయక్

నార్నూర్: బంజారాల ఆరాధ్య దైవం శ్రీసంత్ సేవాలాల్ మహరాజ్ 284వ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని లంబాడాల ఐక్యవేదిక (లైవ్) ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు జాదవ్ వసంత్‌రావు కోరారు. శుక్రవారం మండలంలోని కొత్తపల్లి(హెచ్) గ్రామంలో బంజారా జాతీయ దీక్షభూమి వద్ద దీక్ష గురువు సద్గురు ప్రేంసింగ్ మహరాజ్‌ను కలిసి జయంతి ఉత్సవాలపై చర్చించారు. అనంతరం కరపత్రాలు అందజేశారు. తాడిహత్నూర్‌లో లంబాడా జేఏసీ నాయకులు సమావేశం నిర్వహించారు. ఈనెల 12న హైదరాబాద్‌లోని బంజారా భవన్‌లో నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రాథోడ్ సుధాకర్, నరహరి రాథోడ్, రాజునాయక్ రాథోడ్, జేఏసీ నాయకులు రెడ్డినాయక్, యశ్వంతరావు చౌహాన్, అడే సురేశ్, రాథోడ్ మధుకర్ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేద్దాం

- మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్



మాట్లాడుతున్న మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్

ఇంద్రవెల్లి: బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ అన్నారు. శుక్రవారం మండలంలోని ముత్నూర్ గ్రామంలో బీజేపీ మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ.. కేంద్ర పథకాలను ప్రజలలోకి తీసుకెళ్లాలన్నారు. కార్యకర్తలు బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు భీంరావ్, స్వచ్ఛభారత్ జిల్లా కన్వీనర్ దీపక్‌సింగ్, మరప రాజు, విజయ్‌సింగ్, శివకుమార్ జైస్వాల్, ఆరెల్లి రాజలింగు, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చోడ: రానున్న ఎన్నికల బీజేపీని బూత్‌స్థాయి నుంచి బలోపేతం చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అడే మానాజీ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు కేంద్రే నారాయణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈనెల 10 నుంచి 25 వరకు శక్తి కేంద్రాలతో పాటు బూత్‌స్థాయి సమావేశాలు నిర్వహించి కేంద్ర పథకాలపై అవగాహన కల్పిస్తామన్నారు. సమావేశంలో మండల ఇన్‌చార్జి లక్ష్మణ్, జిల్లా ఉపాధ్యక్షుడు మాధవ్ అమ్టె, సూర్యకాంత్ గిత్తె, సాకాటి దశరథ్, కోల్లురి చంద్రశేఖర్, రమేశ్ పాల్గొన్నారు.

జీపీ భవన నిర్మాణానికి భూమిపూజ

నార్నూర్: గాదిగూడ మండలంలోని లోకారి(బి) గ్రామంలో గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి శుక్రవారం సర్పంచ్ మెస్రం జారుబాయి శేఖర్ భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మెట్‌పల్లి దత్త, వార్డు సభ్యులు లక్ష్మిబాయి, ఉషాబాయి, గ్రామపటేల్ మెస్రం రూప్‌దేవ్, ఎస్ఎంసీ చైర్మన్ రత్నామాల, గ్రామ పంచాయతీ కార్యదర్శి రాహుల్ పాల్గొన్నారు.

రోడ్డు పనులు చేపట్టాలి

సిరికొండ: మండల కేంద్రం నుంచి ఫకీర్ నాయక్ తండా వరకు బీటీ రోడ్డు పనులు చేపట్టాలని ఏఐసీసీ రీసెర్చ్ డిపార్టుమెంట్ రాష్ట్ర కోఆర్డినేటర్ వినోద్ నాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. గత నాలుగు నెలలుగా కాంగ్రెస్ తరుపున రోడ్డు అనుమతుల కోసం పోరాటం చేస్తే పర్యావరణ అనుమతులు వచ్చాయన్నారు. వెంటనే పనులు ప్రారంభించి, ప్రజల కష్టాలు తీర్చాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

'కంటివెలుగు' విజయవంతం చేయండి



పరిశీలిస్తున్న ఐకేపీ ఏపీవో మాధవి

నార్నూర్: గాదిగూడ మండలంలోని రుప్పాపూర్ గ్రామంలో నిర్వహిస్తున్న కంటివెలుగు కార్యక్రమాన్ని ఐకేపీ ఏపీవో మాధవి శుక్రవారం సందర్శించారు. ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు సంజీవ్, స్నేహా పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

తలమడుగు: కంటివెలుగు శిబిరాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి హరీశ్, శ్రీకాంత్ అన్నారు. మండలంలోని సుంకిడి, లింగి గ్రామాల్లో కంటివెలుగు శిబిరం నిర్వహించారు. ప్రతీ కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి కళ్లద్దాలు అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మహేందర్ యాదవ్, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే మండలంలో అభివృద్ధి శూన్యం'



భగీరథ పైపులు పరిశీలిస్తున్న సుహాసినిరెడ్డి

జైనథ్: ఎమ్మెల్యే జోగు రామన్న సొంత మండలం జైనథ్ అభివృద్ధికి నోచుకోలేదని మాజీ జెడ్పీ చైర్‌పర్సన్, బీజేపీ రాష్ట్ర నాయకురాలు చిట్యాల సుహాసినిరెడ్డి విమర్శించారు. శుక్రవారం ఆమె మండల కేంద్రంలో పర్యటించారు. ఇంటింటికీ తిరిగి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మిషన్ భగీరథ పేరిట నిధులు వృథా చేశారని, ఒక్క ఇంటికీ కూడా నీరు రావడం లేదన్నారు. ప్రభుత్వ పాఠశాలలో కనీస వసతులు లేవన్నారు. శ్రీ లక్ష్మీనారాయణ స్వామి ఆలయం శిథిలావస్థకు చేరుకున్నా.. పట్టించుకునే వారే లేరని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాకేష్ రెడ్డి, చిల్క చిన్నన్న, నూకల లస్మన్న, బిక్కి సంతోష్, లక్కం రమేష్, ప్రతాప్ రెడ్డి, ఊషన్న, సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

వాటర్ ట్యాంక్ అందజేత

తలమడుగు: మండలంలోని లింగి గ్రామంలోని సాయి వృద్ధాశ్రమానికి భీంపూర్ మండలంలోని వాడుర్ గ్రామానికి చెందిన పరత్ అశోక్ పది వేల విలువ గల వాటర్ ట్యాంకును శుక్రవారం విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

వన్నెల అశోక్ ఔదార్యం

తాంసి: టీపీసీసీ కార్యవర్గ సభ్యుడు వన్నెల అశోక్ ఔదార్యం చాటుకున్నారు. తాంసి మండలంలోని గిరిగాం గ్రామానికి చెందిన బాలుడు తౌసిఫ్‌కు కాలుకు గాయం కాగా శస్త్రచికిత్స అవసరమైంది. దీంతో వన్నెల అశోక్‌ను కుటుంబసభ్యులు సంప్రదించారు. శుక్రవారం బాలుడికి మంచిర్యాలలో శస్త్రచికిత్స చేయించి కుటుంబానికి అండగా నిలిచాడు.

పోస్టల్ పొదుపుతో భరోసా

నేరడిగొండ: తపాలాశాఖ పొదుపు పథకాలతో ప్రజలకు భరోసా ఉంటుందని బీపీఎం రాజు అన్నారు. శుక్రవారం పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని వడూర్‌లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద, మధ్య తరగతి ప్రజల అభివృద్ధి కోసం అనేక పథకాలను అమలు చేయడం జరుగుతుందన్నారు. ఆడ పిల్లల పెళ్లికి సుకన్య సమృద్ధి యోజన, గ్రామీణ తపాలా జీవితబీమా పథకాలు ఉన్నట్లు తెలిపారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

వెల్లివిరిసిన మత సామరస్యం

తాంసి: భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటిలో నిర్వహించే ప్రతీ పండుగలో హిందూ, ముస్లింలు పరస్పరం సహకారం అందించుకుంటూ మత సామరస్యతను చాటుతున్నారు. శుక్రవారం వేంకటేశ్వర స్వామి ఆలయంలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కాగా.. గ్రామస్తులతో కలిసి ముస్లిం సోదరులు వంటలు చేసి, తమవంతు సహకారం అందించారు.

రూ.6లక్షలు నీటిపాలు!

- సొంత నిధులతో కల్వర్టు నిర్మించిన జెండగూడ గ్రామస్తులు
- చెక్‌డ్యాం బ్యాక్ వాటర్‌తో మునిగిపోనున్న కల్వర్టు
- ఆందోళన చెందుతున్న ఆదివాసీలు



సొంత నిధులతో గ్రామస్తులు నిర్మించిన కల్వర్టు

ఇంద్రవెల్లి: మండలంలోని వడగామ్ వాగు వద్ద ఇటీవల నిర్మించిన చెక్‌డ్యాం బ్యాక్ వాటర్‌తో జెండగూడ గ్రామస్తుల శ్రమ, రూ. 6 లక్షలు నీటి పాలైంది. దశాబ్దల నుంచి రోడ్డు లేక అష్టకష్టాలు పడిన జెండగూడ గ్రామస్తులు రూ. 6లక్షలు జమ చేసి రోడ్డు, కల్వర్టు నిర్మించుకున్నారు. అయితే చెక్‌డ్యాం బ్యాక్ వాటర్‌తో ఆదివాసీలు ఆందోళన చెందుతున్నారు.

ఆదివాసీల శ్రమ వృథా..

మండలంలోని వడగామ్ పరిధిలోని జెండగూడ గ్రామం ఏర్పడి దాదాపు 40 సంవత్సరాలు అవుతుంది. గ్రామానికి రోడ్డు సౌకర్యం లేక, వాగు వద్ద కల్వర్టు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోడ్డు సమస్య, కల్వర్టు సమస్యను పరిష్కరించాలని అధికారులు, ప్రజాప్రతినిధులు చుట్టూ తిరిగినా.. ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. గ్రామాభివృద్ధి కమిటీలో ఉన్న కొద్దిపాటి నిధులు, ఇంటింటికీ విరాళాలు సేకరించి రూ. 6లక్షలు సేకరించారు. ఆనిధులతో మట్టి రోడ్డు నిర్మాణం, కల్వర్టు ఏర్పాటు చేసి రాకపోకలు సాగించారు. అయితే ఇటీవల ప్రభుత్వం చెక్‌డ్యాం నిర్మించడంతో బ్యాక్ వాటర్ కల్వర్టు వరకు వచ్చింది. వర్షాకాలంలో కల్వర్టు పూర్తిగా మునిగిపోయే అవకాశం ఉంది. దీంతో జెండగూడ గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

అత్యవసర సమయంలో అవస్థలు..

చెక్‌డ్యాం నిర్మాణంతో బ్యాక్ వాటర్ కల్వర్టు మునుగుతుందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఇన్ని సంవత్సరాలు కల్వర్టు లేక అత్యవసర సమయంలో ఆస్పత్రికి చేరలేక ప్రాణాలు పోయిన ఘటన ఉన్నాయని వాపోతున్నారు. ఇప్పుడు సొంత నిధులతో రోడ్డు, కల్వర్టు నిర్మించుకుంటే చెక్‌డ్యాం బ్యాక్ వాటర్‌తో మునిగిపోనుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కల్వర్టు మునిగిపోకుండా చర్యలు తీసుకోవాలని ఆదివాసీలు కోరుతున్నారు.

అధికారులు పట్టించుకో లేదు



మా గ్రామం ఏర్పడినప్పుడు వాగు వద్ద కల్వర్టు లేదు. దీంతో అతికష్టంతో రాకపోకలు సాగించి ఇబ్బంది పడ్డాం. రోడ్డు, కల్వర్టు నిర్మించాలని అధికారుల చుట్టూ, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగినా ఎవరూ ప ట్టించుకోలేదు. ఇప్పుడు కల్వర్టు చెక్‌డ్యాం నీటితో పూర్తిగా మునిగిపోనుంది.

తోడసం భీంరావ్, జెండగూడ


మళ్లీ కల్వర్టు నిర్మించాలి



ఎంతో కష్టపడి సొంత నిధులతో నిర్మాణం చేసిన కల్వర్టు చెక్‌డ్యాం నిర్మాణంతో మునిగిపోనుంది. మళ్లీ గ్రామస్తులకు పాత కష్టాలు మొదలు కానున్నాయి. వాగు వద్ద కల్వర్టు నిర్మించి, జెండగూడ వరకు రోడ్డు వేయాలి.

– తోడసం మహదు, జెండగూడ

చట్టాలపై అవగాహన ఉండాలి



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ఆదిలాబాద్‌రూరల్: బాలికలకు తమ హక్కులు, చట్టాలపై అవగాహన ఉండాలని ఎస్సై బాకీ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో మానవ అక్రమ రవాణా నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో షీటీం సేవలు, ఈవ్ టీజింగ్, సోషల్ మీడియా వేధింపులు, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. అత్యవసర సమయంలో మహిళా హెల్ప్‌లైన్, చైల్డ్ హెల్ప్ లైన్ 1098, డయల్ 100 చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మినారాయణ, వార్డెన్ మౌనిక, కానిస్టేబుల్ జోగిందర్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.